క్లుప్తంగా

ఆర్డీటీపై ఆంక్షలు ఎత్తేయాలి



కమ్మూరులో తీర్మానం చేస్తున్న సర్పంచ్

కూడేరు: పేదలకు ఆర్డీటీ కొండంత అండగా నిలిచి వారి సంక్షేమానికి పాటు పడుతోందని కమ్మూరు సర్పంచ్ రంగారెడ్డి పేర్కొన్నారు. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్ చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కమ్మూరు పంచాయతీ తీర్మానం చేసింది. ఈ సందర్భంగా సర్పంచ్ రంగారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో కార్యక్రమంలో ఆర్డీటీ పరిరక్షణ సమితి సభ్యులు వన్నూరప్ప, సంజీవరాయుడు, దాసరి గణేష్, ఆర్డీటీ లబ్ధిదారులు పాల్గొన్నారు.

యువకుడి మృతి

గుత్తి: ఉరవకొండ మండలం రాంపురం గ్రామానికి చెందిన రమేష్ (33)గురువారం తన అత్తారింటికి గుత్తికి వచ్చాడు. పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు గుత్తి ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం అక్కడి వైద్యులు మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు రెఫర్ చేశారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడని పోలీసులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ప్రైవేటీకరణ నిర్ణయం సరికాదు

కూడేరు: వైద్య కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయం సరికాదని, పేద విద్యార్థులు వైద్య విద్యను అభ్యసించకూడదా? అని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు మంజునాథ్ రెడ్డి కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించాడు. శుక్రవారం ఆయన కూడేరులో విలేకరులతో మాట్లాడారు. వైద్య కళాశాలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయడం దారుణమన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మంజూరై వివిధ నిర్మాణ దశల్లో ఉన్న ఆరు మెడికల్ కాలేజీల నిర్మాణాలను కూడా ప్రభుత్వం ఆపేయించడం దుర్మార్గమన్నారు. విద్యార్థి విభాగం నాయకులు పురుషోత్తం, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



ఆర్థిక సహాయం అందిస్తున్న సమన్వయకర్త తలారి రంగయ్య

కుందుర్పి: కేన్సర్‌తో బాధపడుతున్న ఎర్రగుంటకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త హనుమంత రాయుడుకు సోషల్ మీడియా ప్రతినిధులు పోగు చేసిన రూ.3 లక్షలు మాజీ ఎంపీ తలారి రంగయ్య చేతుల మీదుగా శుక్రవారం అందించారు. తలారి రంగయ్య తనవంతుగా బాధితుడికి నగదు అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ కమలా నాగరాజు, మండల కన్వీనర్ హనుమంతరాయుడు, మండల ఉపాధ్యక్షుడు భీమప్ప, అనుబంధ సంఘాల అధ్యక్షులు, నాగలక్ష్మి సర్పంచులు వన్నూర్‌రెడ్డి, రామూర్తి, అతావుల్లా, జగన్, కళ్యాణదుర్గం, శెట్టూరు మండల కన్వీనర్లు సూరి, హనుమంతరాయుడు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ ఎదుట దళితుల ఆందోళన



విడపనకల్లులో పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న ఎస్సీ కాలనీవాసులు

విడపనకల్లు: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఎదుట దళితులు శుక్రవారం ఆందోళన చేశారు. ఇటీవల వినాయక నిమజ్జన వేడుకలో బోయ రమేష్, తరుణ్, రుద్ర, బారిక పవన్‌తో పాటు మరో ఐదుగురు ఉలిగన్న అనే వ్యక్తిపై బీరు బాటిల్‌తో తలపై బాది తీవ్రంగా గాయపరిచారు. ఉలిగన్నపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని ఎస్సీ,ఎస్టీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి , మధు తదితరులు గుంతకల్లు డీఎస్పీ శ్రీనివాస్‌ను డిమాండ్ చేశారు. ఉలిగన్నపై దాడి చేసిన వారిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, అరెస్టు చేయకపోతే జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తామని హెచ్చరించారు. అనంతరం డీఎస్పీకి వినతిపత్రం అందించారు. డీస్పీ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న ఉలిగన్న, అతని బంధువులు, భార్య ముత్తమ్మను, గ్రామస్తులను విచారించారు.

పాఠశాల ఆవరణలో ఆస్పత్రి నిర్మించొద్దు

కళ్యాణదుర్గం రూరల్: పాఠశాల ఆవరణలో ప్రభుత్వాస్పత్రి నిర్మించడం సరికాదని సీపీఐ నియోజకవర్గం కార్యదర్శి గోపాల్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ఎస్వీఎస్ ఫంక్షన్ హాల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. కుందుర్పి మండలం ఎనుములదొడ్డి గ్రామంలో ప్రభుత్వాస్పత్రి నిర్మించాలని నిర్ణయించారని, ఆస్పత్రి నిర్మాణానికి గ్రామస్తులు స్థలం దానం చేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. పాఠశాల ఆవరణలో ఆసుపత్రి నిర్మాంచాలనే ఆలోచన మానుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎనుముల దొడ్డి గ్రామస్తులు నాగరాజు, బొమ్మలింగ, తిప్పేస్వామి, దినేష్, ఆనంద్, ఆంజనేయులు, బాధ పల్లెప్ప, రామచంద్ర, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ

- ఉరవకొండలో జెండాకు గజమాల వేసిన మాజీ ఎమ్మెల్యే విశ్వ
- పార్టీ మైనార్టీ విభాగం ఆధ్వర్యంలో ఆహార పొట్లాల పంపిణీ



ఉరవకొండలో జెండా ఊరేగింపులో వేలాదిగా పాల్గొన్న ముస్లింలు



మిలాద్ జెండాకు పూలమాల వేసి ప్రార్థనలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ



రాయదుర్గంలో ప్రదర్శించిన మక్కా, మదీనా నమూనాలు



రాయదుర్గంలో మిలాదున్ నబీ ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు



మైనార్టీలకు స్వీట్లు, తాగునీరు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ, పార్టీ మైనార్టీ నేతలు

ఉరవకొండ: పట్టణంలో మిలాద్ ఉన్ నబీ వేడుకలు శుక్రవారం వేలాది మంది ముస్లిం సోదరుల మధ్య భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక జామీయ మసీదు వద్ద ఉన్న అసార్ మకాన్ నుంచి విశేష పుష్పాలతో అలంకరించిన జెండాను సయ్యద్ అజ్మతుల్లా హుసేనీ, సయ్యద్ తఖీబాబా, సయ్యద్ తాసీర్ బాబాల ఆధ్వర్యంలో ముస్లింలు భారీ ర్యాలీ చేశారు.

జెండా ఊరేగింపులో పాల్గొన్న విశ్వేశ్వరరెడ్డి..: జెండా ఊరేగింపులో మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి పాల్గొన్నారు. మైనార్టీ విభాగం ఆధ్వర్యంలో ముస్లింలకు మిఠాయిలు, ఖర్జూరం, తాగునీటి సౌకర్యం కల్పించారు. మైనార్టీ నాయకులు బెలగల్ షమ్ము, జీఎంఎస్ మీరంబాషా, బళ్లారి ఆసీఫ్, మోమిన్ జిలాన్, కపట్రాళ్ల బషీర్, పామిడి జాకీర్, బొంబాయిసెట్ మైనుద్దీన్, టైలర్ శర్మాస్, బషీర్, ఇర్ఫాన్, వన్నూర్‌సాబ్, శిలార్ శర్మాస్, షేక్షా (సేవాగ్), బాషా, పార్టీ అధికర ప్రతినిధి వీరన్న, ఎంపీపీ నరసింహులు, వైస్ ఎంపీపీ ఈడిగప్రసాద్, నాయకులు బసవరాజు, తిప్పయ్య, ఎర్రిస్వామిరెడ్డి పాల్గొన్నారు.

రాయదుర్గంటౌన్: రాయదుర్గంలో జష్నే ఈద్ మిలాద్ ఉన్ నబీ (మహమ్మద్ ప్రవక్త జన్మదినం) వేడుకలను ముస్లింలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గౌసేఆజం దర్గా మసీదు కమిటీ, సున్నత్ వజమాత్ ఆధ్వర్యంలో భారీఎత్తున ఊరేగింపు నిర్వహించారు. యువత ఇస్లామిక్ జెండాలతో బైక్ ర్యాలీ చేశారు. ర్యాలీలో వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి హాజరయ్యారు. దర్గా మసీదు ముతవల్లి అబ్దుల్ వాహాబ్, చమ్మా అస్లాం, అబూబక్కర్, చమ్మా అజీజ్, హమీద్, ప్రభుత్వ ఖాజీ సైఫుల్లా, అంజుమన్ అజ్మతుల్ ఇస్లాం కమిటీ అధ్యక్షుడు బ్రెడ్ సర్మాస్, అబ్దుల్ ఖదీర్, మౌలానా ముజాహిద్ రజా తదితరులు హాజరయ్యారు.

మహమ్మద్ ప్రవక్త కేశ దర్శనం

మిలాద్ ఉన్ నబీ సందర్భంగా సున్నీ దర్గా మసీదులో శుక్రవారం సాయంత్రం అసర్ నమాజ్ అనంతరం ఏర్పాటు చేసిన మహమ్మద్ ప్రవక్త కేశాన్ని తిలకించేందుకు ముస్లింలు ఎంతో ఆసక్తి చూపారు.

కళ్యాణదుర్గం: మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా ముస్లింలు మిలాద్–ఉన్–నబీ వేడుకలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. టీ సర్కిల్ సమీపంలోని మదీనా మజీద్ నుంచి జూలూస్ (ర్యాలీ) గాంధీ చౌక్, వాల్మీకి సర్కిల్, జామియా మజీద్, రాచప్పబావి వీధి, సెంటర్ స్కూల్, సౌభాగ్య థియేటర్, బళ్లారి మిట్ట, కాలేజ్ రోడ్డు, అనంతపురం రోడ్డు మీదుగా తిరిగి టీ సర్కిల్ వరకు సాగింది.

బొమ్మనహాళ్: బొమ్మనహాళ్, ఉద్దేహాళ్ , శ్రీధరఘట్ట, దర్గాహొన్నూరు, కల్‌హోళ, గోవిందవాడ, గోనేహాళ్, నేమకల్లు, కురువల్లి, బొల్లనగుడ్డం తదితర గ్రామల్లో శుక్రవారం వేడుకలు నిర్వహించారు.

కణేకల్లు: మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలను పురస్కరించుకొని మండల కేంద్రంలో శుక్రవారం మిలాద్ ఉన్ నబీ వేడుకలను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం మదీనా మసీదు నుంచి ముస్లింలు శాంతిర్యాలీ చేశారు. మహమ్మద్ ప్రవక్త జీవితచరిత్రపై జామీయా మసీదు ముతవల్లీ ముర్షిద్‌పీర్‌ఖాద్రీ వివరించారు. ఖాజీ మహమ్మద్ ఖాజీంబాషా, అబ్దుల్ వహాబ్ ఖాద్రీ, నేముతుల్లా సాహెబ్, మైనార్టీ నాయకులు షేక్ ఫకృద్దీన్, ఎంసీ సర్మాస్ పాల్గొన్నారు.

విడపనకల్లు: విడపనకల్లులో ముస్లింలు శుక్రవారం మిలాద్ ఉన్ నబీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మిలాద్ ఉన్ నబీ వేడుకల సందర్భంగా ముస్లింలు మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం జెండా పట్టుకొని ఊరేగించారు. కార్యక్రమంలో ముస్లింలు, మత పెద్దలు పాల్గొన్నారు.



విడపనకల్లులో మిలాద్ ఉన్ నబీ వేడుకలు నిర్వహిస్తున్న ముస్లింలు



సున్నీ దర్గా మసీదులో ప్రవక్త కేశాన్ని తిలకిస్తున్న ముస్లింలు



ఉద్దేహాళ్‌లో జెండాను ఊరేగిస్తున్న ముస్లింలు



కళ్యాణదుర్గంలో శాంతిర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు



కణేకల్లులో మక్కా మదీనా నమూనాలతో శాంతిర్యాలీ నిర్వహిస్తున్న ముస్లీములు



మిలాదున్ నబీ ర్యాలీలో పాల్గొన్న ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి

బొలెరో వాహనం బోల్తా

కళ్యాణదుర్గం రూరల్: మండల పరిధిలోని బోరంపల్లి గ్రామం సమీపంలో బొలెరో వాహనం శుక్రవారం బోల్తాపడింది. అనంతపురం నుంచి కర్ణాటక వైపు చేపల లోడుతో వెళ్తున్న బొలెరో వాహనం తీరా బోరంపల్లి వద్దకు రాగానే వేగం నియంత్రించలేక రోడ్డు పక్కన దూసుకెళ్లి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ స్వల్పంగా గాయపడ్డాడు. రూరల్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

చికిత్స పొందుతూ రైతు మృతి

కూడేరు: మండలంలోని ముద్దలాపురానికి చెందిన రైతు జెన్నే పెన్నోబులేసు (28) గత నెల 21న పురుగులు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అనంతపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడికి భార్య భాగ్యమ్మ, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలి

బొమ్మనహాళ్: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఎస్‌ఐ నబీ రసూల్ అన్నారు. శుక్రవారం మండలంలోని కేజీబీవీ, ప్రతిభ ఇంగ్లిష్ మీడియం పాఠశాల, ఉద్దేహాళ్ గ్రామంలో జిల్లా ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు సురక్ష వెహికల్ ద్వారా సైబర్ నేరాలపై ప్రజలకు వీడియో రూపంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల చేతిలో నష్టపోతే తక్షణమే 1930లో ఫిర్యాదు చేయాలన్నారు.

విద్యార్థి విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాబు

కళ్యాణదుర్గం: వైఎస్సార్ విద్యార్థి విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా కుందుర్పి మండలం ఎనుములదొడ్డికి చెందిన పెద్దమూసాయప్పగారి బాబును నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి శుక్రవారం ఉత్తర్వులు అందాయి. తన ఎంపికకు సహకరించిన పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి, సమన్వయకర్త, మాజీ ఎంపీ డాక్టర్ తలారి రంగయ్యలకు బాబు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

వైద్య బృందం పర్యటన

ఉరవకొండ: రాకెట్లలో పీహెచ్‌సీ వైద్యాధికారులు వెంకటేష్‌నాయక్, పావని, మలేరియా సబ్ యూనిట్ అధికారి భత్తుల కోదండరామిరెడ్డి ఆధ్వర్యంలో వైద్య బృందం శుక్రవారం పర్యటించారు. ఈసందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఫీవర్ సర్వే నిర్వహించి, జ్వరంతో బాధపడుతున్న వారిని గుర్తించారు. అనంతరం డెంగీ, మలేరియా, టైఫాయిడ్ పరీక్షల కోసం కొందరిని రెఫర్ చేశారు. గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగుపరిచేలా పంచాయతీ అధికారులు ఫాగింగ్ చేశారు.

కూటమి ప్రభుత్వానిది మోసపూరిత పాలన



ప్రభుత్వ మోసాలను మహిళలకు వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

రాయదుర్గంటౌన్: కూటమి ప్రభుత్వం మోసపూరిత పాలన సాగిస్తోందని మున్సిపల్ చైర్‌పర్సన్ పోరాళ్ల శిల్ప సూచించారు. శుక్రవారం సాయంత్రం పట్టణంలోని 19, 22 వార్డుల్లో 'బాబు ష్యూరిటీ..మోసం గ్యారంటీ' రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డు కౌన్సిలర్లు శారదాదేవి, గౌని లావణ్య, వార్డు ఇన్‌చార్జ్ రామాంజనేయులు, పట్టణ కన్వీనర్ మేకల శ్రీనివాసులు, చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోరాళ్ల శివకుమార్‌తో కలిసి చైర్‌పర్సన్ శిల్ప మాట్లాడుతూ చంద్రబాబుది సూపరి పాలన కాదని.. మోసాల పాలన అని అన్నారు. వైఎస్ జగన్ అమలు చేసిన పథకాలతో చేకూరిన లబ్ధిని.. ప్రస్తుత ప్రభుత్వంలో హామీలు అమలు చేయకుండా చేస్తున్న మోసాన్ని గుర్తించుకోవాలన్నారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు శ్రీనివాసులు, నజీర్, మాజీ కౌన్సిలర్ రఘురాం, వైఎస్సార్‌సీపీ పట్టణ ఉపాధ్యక్షుడు సునార్ ఇస్మాయిల్, వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి బషీర్ అహ్మద్, వార్డు ఇన్‌చార్జ్ నిజాముద్దీన్, వైఎస్సార్‌సీపీ యూత్ అధ్యక్షుడు అరవింద్‌బాబు, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆంజనేయులు, ప్రచార కార్యదర్శి తిప్పేస్వామి, కొలిమి ఆనంద్, బడిగే బషీర్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

గుమ్మఘట్ట: మండలంలోని కలుగోడు గ్రామ సమీపంలో వేదావతి హగరి నుంచి సిరిగెదొడ్డి వెళ్తున్న టీడీపీ నాయకులకు చెందిన రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్‌ఐ ఈశ్వరయ్య శుక్రవారం తెలిపారు. తహసీల్దార్ అనుమతితో అపరాధ రుసుం విధించి, వదిలేసినట్లు ఆయన తెలిపారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం పట్టణంలోని కమ్మాన్‌చెట్ల వీధికి చెందిన వన్నూరు స్వామి (35) అనారోగ్యంతో శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు. పార్టీ సమన్వయకర్త, మాజీ ఎంపీ డాక్టర్ తలారి రంగయ్య తదితరులు వన్నూరుస్వామి మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. పార్టీ అండగా ఉంటుందని, అధైర్య పడొద్దని భరోసా ఇచ్చారు. మృతుడికి భార్య రామాంజనమ్మ, నలుగురు పిల్లలు ఉన్నారు. మాజీ ఎంపీ రంగయ్యతో పాటు జిల్లా కార్యదర్శి యర్రంపల్లి కృష్ణమూర్తి, స్థానిక నాయకులు శివన్న, గంగాధర, తిమ్మన్న, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


రైతులపై నిర్లక్ష్యం సరికాదు

కూడేరు: కూటమి ప్రభుత్వం రైతులపై నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేశవ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతుల అవసరానికనుగుణంగా యూరియాను అందించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. యూరియా కొరతను సృష్టించి, రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందని మండిపడ్డారు. ఈ నెల 8న కూడేరులో రాస్తారోకో చేస్తామన్నారు. నాయకులు పెరుగు సంగప్ప, మల్లికార్జున, శ్రీరాములు ,రమణప్ప, రమణ, మలరాయు డు, వెంకటేశులు, ముత్యాలన్న, ధనరాజ్ పాల్గొన్నారు.

రేపు నేమకల్లు ఆలయం మూసివేత

బొమ్మనహాళ్: నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయాన్ని సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా ఆదివారం మధ్యాహ్నానికి మూసివేస్తున్నట్లు ప్రధాన అర్చకులు అనిల్‌కుమార్ చార్యులు తెలిపారు. ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించి, మధ్యాహ్నం 1 గంటకు ఆల య తలుపులు మూసి వేస్తున్నట్లు తెలిపారు. 12 గంటల వరకు మాత్రమే స్వామి వారి దర్శనానికి అను మతిస్తున్నట్లు తెలిపారు. తిరిగి సోమవారం ఉదయం స్వామివారికి పూజలు యథావిధిగా జరుగుతాయన్నారు.

శ్రీకల్లేశ్వరస్వామి ఆలయాభివృద్ధికి కృషి



ఆలయ కమిటీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న గాజుల విజయకుమార్

కణేకల్లు: మండలంలో ప్రసిద్ధిగాంచిన శ్రీకల్లేశ్వర స్వామి ఆలయాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఆలయ కమిటీ నూతన చైర్మన్ గాజుల విజయకుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని మాల్యం గ్రామం శ్రీకల్లేశ్వరస్వామి ఆలయ ఆవరణలో ఆలయ కమిటీ చైర్మన్‌గా గాజుల విజయకుమార్ ప్రమాణ స్వీకారం చేశారు. ఉరవకొండ డివిజన్ దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ రాణీ చైర్మన్‌తోపాటు మరో ఏడుగురు సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, దేవదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ దేవదాసు, పంపనూరు దేవాలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బాబు పాల్గొన్నారు. నూతన చైర్మన్‌ను సన్మానించారు.

వృద్ధుడు అదృశ్యం

అనంతపురం: శెట్టూరు మండలం యాటకల్లు గ్రామానికి చెందిన షేక్ ఆయాసాబ్ (73) కనిపించలేదని కుటుంబ సభ్యులు అనంతపురం త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. షేక్ ఆయా సాబ్‌కు ఇద్దరు కుమార్తెలు. భార్య అత్తార్ బీ సుమారు 5 నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. అప్పటి నుంచి మానసిక స్థితి సరిగా లేదు. చిన్న కూతురు కొలిమి రహమ్మద్ బీ వద్ద అనంతపురంలో ఉంటున్నాడు. గురువారం మధ్యాహ్నం నుంచి కనిపించలేదని ఫిర్యాదు చేసినట్లు త్రీటౌన్ సీఐ కే.శాంతిలాల్ తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న శ్రీధర్



ఉరవకొండలో ఉత్తమ గురువులను సత్కరిస్తున్న లయన్స్ సభ్యులు

ఉరవకొండ: స్థానిక లయన్స్ క్లబ్ కార్యాలయంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉత్తమ ఉపాధ్యాయులను క్లబ్ సభ్యులు ఘనంగా శుక్రవారం సత్కరించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు లక్ష్మీనారాయణ, కార్యదర్శి వేదమూర్తి, గణేష్‌బాబు, సప్తగిరిమల్లి తదితరుల ఆధ్వర్యంలో ఉరవకొండ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ షాషావలి, డిగ్రీ అధ్యాపకులు పరమేష్, ఎర్రిస్వామి, ఫిజిక్స్ అధ్యాపకులు డాక్టర్ రాజేష్, శ్రీనివాసులు, లక్ష్మీనారాయణను సన్మానించారు. కార్యక్రమానికి స్పాన్సర్‌గా లయన్స్ సభ్యులు కృష్ణమోహన్, సభ్యులు ప్రభాకర్‌నాయుడు, ఎంసీ నాగభూషణం, బాలచంద్ర, సత్యనారాయణ, విశ్వనాథ్, నూర్‌మహ్మద్‌లు పాల్గొన్నారు.

కుందుర్పి: మండల కేంద్రంలో గురు పూజోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఉపాధ్యాయ సంఘాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో గురుపూజోత్సవం నిర్వహించారు. ఎస్టీయూ నాయకులు కే.కృష్ణమూర్తి, రాధాకృష్ణంరాజు, చెన్నరాయప్ప, జయరాములు, రేవన్న, ఏపీటీఎఫ్ నాయకులు బీసీ, తిమ్మప్ప, బొమ్మయ్య, ఈరన్న, మంజు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాయదుర్గంటౌన్: గురువులు సమాజానికి మార్గదర్శకులు అని లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు తాయి శ్రీనివాసులు, పోరాళ్ల ధనార్జున పేర్కొన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆఫ్ రాయదుర్గం సిటిజన్స్ ఆధ్వర్యంలో రాయదుర్గం అర్బన్, రూరల్, గుమ్మఘట్ట, డి.హీరేహాళ్ మండలాల్లో పనిచేసే కొందరిని బెస్ట్ టీచర్స్‌గా ఎంపిక చేసి శుక్రవారం స్థానిక ఎపీఎన్జీవో భవనంలో వారిని ఘన సన్మానించారు. లయన్స్ క్లబ్ సభ్యులు శ్రీనివాసులు, పేర్మి సత్యనారాయణ, అంభోజీరావు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని సరస్వతీ విద్యా మందిరం పాఠశాలలో శనివారం ఘనంగా ఉపాధ్యాయులు దినోత్సవం నిర్వహించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ భావి తరాలను తీర్చిదిద్దేవారు వృత్తి ఉపాధ్యాయుల మాత్రమే అని కొనియడారు. పాఠశాల అధ్యక్షుడు శ్రీనరసింహమూర్తి లక్ష్మి దంపతులు ప్రధానాచార్యులు కరణం తిరుమల రావు ఆచార్య బృందానికి నూతన వస్త్రాలను ఇచ్చి, సన్మానం చేశారు.

అవార్డు మరింత బాధ్యతను పెంచింది

కళ్యాణదుర్గం రూరల్: ఉత్తమ అధ్యాపకుడి అవార్డు మరింత బాధ్యతను పెంచిందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అర్థశాస్త్ర అధ్యాపకుడు శ్రీధర్ తెలిపారు. శుక్రవారం ఆయన విజయవాడలో సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. అధ్యాపకుడు శ్రీధర్ మాట్లాడుతూ గురుపూజోత్సవం సందర్భంగా తనకు విద్యను బోధించిన గురువులందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

ఉత్తమ గురువులకు అవార్డులు

గుమ్మఘట్ట: మండలంలోని నేత్రపల్లి హెచ్ఎం ఆదిశంకర్, గోనబావి హెచ్ఎం సుబ్రహ్మణ్యం, చౌళూరు హెచ్ఎం సుశీల, పూలకుంట బయోలజీ ఉపాధ్యాయురాలు సుజనా, గోనబావి సోషల్ ఉపాధ్యాయుడు వేణుగోపాల్, రాయదుర్గం మండలంలోని ఆవులదట్ల పీడీ శివశంకరప్ప ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు.



ఆదిశంకర్, నేత్రపల్లి పాఠశాల హెచ్ఎం



సుబ్రహ్మణ్యం, గోనబావి హైస్కూల్ హెచ్ఎం



సుశీల, చౌళూరు పాఠశాల హెచ్ఎం



సృజన, పూలకుంట బయోలజీ టీచర్



వేణుగోపాల్, గోనబావి సోషల్ ఉపాధ్యాయుడు



శివశంకరప్ప , ఆవులదట్ల హైస్కూల్ పీడీ

రేషన్‌పై కొరవడిన పర్యవేక్షణ

- కనిపించని ఆహార సలహా సంఘాల పర్యవేక్షణ
- నాణ్యత కూడా ప్రశ్నార్థకం



కళ్యాణదుర్గం ఆర్డీఓ కార్యాలయం

కళ్యాణదుర్గం: నియోజకవర్గంలో ప్రతి మూడు నెలలకోసారి నిర్వహించే ఆహార సలహా సంఘాల పర్యవేక్షణ కొరవడింది. రేషన్ సరుకుల నాణ్యత, ప్రజలకు చేరవేయడంలో లోపాలను గుర్తించి, ఎప్పకప్పుడు సలహాలు, సూచనలు అందించాల్సిన సలహా సంఘాల కనిపించడంలేదు. ప్రభుత్వాలు ప్రతి పేద కుటుంబం ఆకలి తీర్చేందుకు రేషన్ సరుకులు అందిస్తున్నాయి. చౌక ధరల దుకాణాల ద్వారా బియ్యం పంపిణీ చేస్తున్నాయి. గతంలో నాలుగైదు రకాల నిత్యావసర సరుకులు అందించేవారు. ప్రస్తుతం బియ్యం, జొన్నలు, చక్కెర మాత్రమే అందజేస్తున్నారు. వీటి పర్యవేక్షణకు మండల, డివిజన్ స్థాయిల్లో ఆహార సలహా సంఘాలు ఏర్పాటు చేశారు. వీరు ప్రతి మూడు నెలలకోసారి సమావేశమై రేషన్ బియ్యం నాణ్యత, పంపిణీ తీరు, మధ్యాహ్న భోజనం , అంగన్‌వాడీల్లో అందిస్తున్న పౌష్టికాహారం తదితర అంశాలపై చర్చించాలి. లోపాలుంటే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి. అయితే ప్రస్తుతం నియోజకవర్గంలో ఈ సంఘాలు కనుమరగయ్యాయి.

సభ్యులు ఎవరంటే...:

రేషన్ సరుకులు లబ్ధిదారులకు సక్రమంగా అందేలా ప్రభుత్వం ఆహార సలహా సంఘాలను ఏర్పాటు చేసింది. జిల్లా స్థాయిలో కలెక్టర్, డివిజన్ స్థాయిలో ఆర్డీఓ, మండల స్థాయిలో తహసీల్దార్లు చైర్మన్లుగా ఉంటారు. మండల స్థాయిలో ఎంపీపీ సహా చైర్మన్‌గా ఉంటారు. జెడ్పీటీసీ సభ్యుడితో పాటు ముగ్గురు మహిళా ప్రతినిధులు, వ్యవసాయాధికారి, ఇద్దరు పాత్రికేయులు, ఇద్దరు ఉపాధ్యాయులు, ఎంపీడీఓ, ఇద్దరు రైతులు, డీలరు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధి, రాజకీయ పార్టీల నుంచి ఒకరు సభ్యులుగా ఉంటారు.

సరుకుల నాణ్యత ప్రశ్నార్థకం...:

సంఘాల పర్యవేక్షణ లేకపోవడంతో సరుకుల నాణ్యత ప్రశ్నార్థకంగా మారిందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇటీవల బియ్యం తక్కువగా వస్తున్నాయని పలువురు డీలర్లు, నాణ్యతగా లేవని లబ్ధిదారులు ఫిర్యాదులు చేస్తున్నారు. ఇక మధ్యాహ్న భోజనం, అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారంపై ప్రశ్నించే వారు లేకుండా పోయారు. పేద పిల్లలకు అంగన్‌వాడీల్లో అందించాల్సిన పౌష్టికాహారం పక్కదారి పడుతోందనే విమర్శలు నియోజకవర్గంలో బలంగా వినిపిస్తున్నాయి. క్రమం తప్పకుండా సమావేశాలు ఏర్పాటు చేస్తే క్షేత్ర స్థాయిలో ఇలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా పేదలకు మేలు జరుగుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఆహార సలహా సంఘాల సమావేశాల నిర్వహణపై కళ్యాణదుర్గం సీఎస్‌డీటీ దుర్గా ప్రసాద్‌ను వివరణ కోరేందుకు పలుమార్లు 'సాక్షి' ప్రయత్నించినా ఆయన అందుబాటులోకి రావడంలేదు.

నియోజకవర్గంలో రేషన్ దుకాణాలు, కార్డుల సంఖ్య...

మండలం	మొత్తం షాపులు	మొత్తం కార్డులు	మొత్తం లబ్ధిదారులు
బ్రహ్మసముద్రం	39	13,835	44,199
కళ్యాణదుర్గం	79	26,889	81,787
కంబదూరు	48	16,564	49,4942
కుందుర్పి	42	17,284	54,438
శెట్టూరు	38	13,946	43,244
మొత్తం	246	88,518	27,3160